# అనగనగా... ఒక కథ

వేసవికాలం బోరింగులు నీళ్లడుగంటి, పాతాళంలో నీళ్లని అందుకోలేక బోర్ బోర్‌మని ఏడుస్తుంటాయి- ఇలాంటప్పుడు చుట్టుపక్కల ఊళ్ల వాళ్లంతా ఇంటిమీద పడి 'బేర్ బేర్' మనటం రివాజే. శంకరరావుకి, శ్రావణపల్లికి ఈ కష్టాలు బాగా ఎక్కువ. వాళ్ల దగ్గర్లో వున్న చెరువులోనో దూరంగా గట్టుకిందకి ఎక్కడో వున్న గోదావర్లోనో నీళ్లు బిందెల్తో మోసుకుని తెచ్చుకున్నన్నాళ్లూ ఏ ఇబ్బందీ లేదు.

## బోరింగ్‌లో... కన్నీళ్లు

రెండు పుష్కరాల్నాడు పంచాయితీ వాళ్లు శ్రావణపల్లి జనాల కోసం రెండు బావులు తవ్వించారు. ఒకదాని పేరు బ్రాహ్మణ బావి- రెండోదాని పేరు ఊరు బావి. ఊరుబావి ఎండిపోతే, బ్రాహ్మణ బావిలోంచి ఎవరో జబ్బపుష్టి వున్న బ్రాహ్మలు నీళ్లు తోడి ఊరివాళ్లకి పోసి ఇచ్చేవాళ్లు. ఊళ్లో వాళ్లెవరూ చేద బావిలోకి వెయ్యడానికి వుండేది కాదు. జబ్బపుష్టి గల పుణ్యాత్ముడు జబ్బుపడో, మరో ఊరికో వెళ్తే రెండుతాళ్ల ఎత్తు గోదారొడ్డు దిగి నీళ్లబింది నింపుకుని పైకి మోసుకుని ఊళ్లోకి వచ్చేవాళ్లు. ఇలా వుండగా.. బావులు పూడికలు తీయించడం మానేసి కొత్త పంచాయితీ ప్రభుత్వం ఊళ్లో పేటకో బోరింగ్ వేయిస్తానని.. మీకిక బావితో పనేంలేదనీ.. మీ తుక్కు కుండీగా బావుల్ని వాడుకోండనీ.. మాటిచ్చి ఓట్లేయించుకుని నెగ్గేసిందా ప్రభుత్వం.

ఇపుడు.. బోరింగ్ పంపుల్దే రాజ్యం. బావి పూడికలు తీసే కులం నోట్లో 'మన్ను' పడింది. బోర్లు బాగుచేసేవాళ్ల పంట పండింది. హేండిల్‌లో వాషర్- బేస్‌లో వాషర్- గొట్టం లోపలున్న ఫిల్టరూ- వీటిని ఏడాదికి రెండుసార్లు బాగుచేయాలి. ఏటికేడాదీ చుట్టుపక్కల ఏ ఊళ్లో ఏ పేటల్లో బోరింగ్ పంపు పాడైనా శంకర్రావు పార్టీదే వ్యాపారం. బోరింగ్ పాడవకపోతే.. హేండిల్ మొదట్లో వున్న చిల్లులోంచి గుట్టుచప్పుడవకుండా రెండు గుప్పిళ్లు ఇసక పోస్తే పై వాషర్ చచ్చి వూరుకుంటుంది. ఇంకో రెండు గుప్పిళ్లు పడితే కింద వాషర్ కూడా పాడైపోయేది. ఈ నాలుగ్గుప్పిళ్ల ఇసక ఎవరు పోస్తారు అనేది.. శంకర్రావు ఒక్కడికే తెల్సు.

శ్రావణపల్లిలో కాపుల గూడెంలో బోరింగ్ పంపు ఆగిపోయింది. ఎంత కొట్టినా 'గ్ర్ గ్ర్..' సౌండే తప్ప నీళ్లేం రావట్లేదు.

ఆ సంగతి మన శంకర్రావుకి తెల్సు.

నిన్నన్నుంచీ కూలీలని రడీగా పెట్టాడు.

"శ్రావణపల్లి వాళ్లు వొస్తారు- కాపుల గూడెంకెళ్లాల" అని వాళ్లని రడీగా జమాయించి పెట్టుకున్నాడు.

వాళ్లొచ్చారు-

"మూడ్రోజుల తర్వాత వస్తాం" అన్నాడు శంకర్రావు.

"బాబ్బాబు... నీళ్లు రాక అల్లాడిపోతున్నాం" అన్నాడు కాపు కులపెద్ద.

"మరివ్వాళ నేను ఫలానా ఊళ్లో... ఫలానా జమిందారుగారి పెరటి బోరుపంపు రిపేరీకి వప్పుకున్నానే..." నోట్లో చుట్టని తుదికొరికి ఉమ్మేసి వెలిగించుకుంటూ చెప్పాడు.

కన్నీళ్లతో కనిపించాడో... వాటితో కాళ్లు కడిగాడో... కాపు కులపెద్ద శంకర్రావుని వప్పించాడు.

"సరే పెద్దాయనా... నువ్ చెప్పావ్- నేనొస్తున్నాను- నలుగురం వస్తున్నాం- నాలుగు పాతికలైనా ఇచ్చుకోవాలి- నాకు నువ్వేమీ ఇవ్వక్కర్లేదులే..." అన్నాడు.

* * *

శంకర్రావు తన కూలీల్తో శ్రావణపల్లి వెళ్లాడు. బోరింగ్ పంపు తలకి వున్న బోల్టులు విప్పడానికి నట్లు తిప్పినట్లు నటించి... ఇంకోడికి పనప్పగించి... తను అలిసిపోయాడు.

హెల్పర్ అనే కూలి... శంకర్రావు సైజు చూసి ఇచ్చిన రెంచితో బోరింగ్ హెడ్ విప్పి కిందకి పెట్టాడు. శంకర్రావు 'వాషర్' చెడిపోయిందని కొత్త వాషర్ వేయాలని వేయించాడు. అతను అనుకున్నట్లుగా అడుగునున్న వాషర్ కూడా చెడిపోయిందని రుజువు చేశాడు.

ప్రతీ క్షణానికీ ప్రతీ వస్తువుకీ విలువ నిర్ధారించి పైసలు పెంచుకుంటూ ఇంతకి రెండింతలు వసూలు చేసుకుని వెళ్లటం శంకర్రావు హాబీ! కాదు వృత్తి!!

ఏదేమైనా... అతను అడిగినంత డబ్బూ ఇవ్వాలి. వచ్చినవాడు... ఆఫ్టాల్ మేస్త్రీ అనో... మెకానిక్ అనో చిన్నచూపు చూస్తే కుదరదని అందరికీ తెల్సు. అందుకే... అతను రాగానే... కొబ్బరిబొండాలు సరఫరా అయ్యాయి. మధ్యాహ్నం భోజనాలకి ముందు కోడిగుడ్లు బాయిల్ అయ్యాయి. భోజనానికి ముందు తాడిచెట్టు మీంచి కల్లు కుండలు దిగాయి. మహారాజ భోగాలు అమరాయి. స్వయంగా ప్రెసిడెంట్ గారు మేక తల మేస్త్రిగారికీ, ఒక్కొక్కరు ఒక్కో కూలీకి ఇంటినుంచి వండించి పంపించాడు.

ఎందుకింత సేవ?

ఎందుకింత ఆదరణ??

శంకర్రావుకి బాలేదు- తను డబ్బుకోసం... డబ్బు కోసమే పనిచేసే కూలి- కాకపోతే ఇవ్వాళ మేస్త్రీ.

గూడెం వాళ్లందరూ తనని ఓ అల్లుడిలాగో- పట్నం నుంచి వచ్చిన కొడుకులాగో ఆదరిస్తున్నారు.

శంకర్రావు 'వాషర్' చెడిపోయిందని కొత్త వాషర్ వేయాలని వేయించాడు. అతను అనుకున్నట్లుగా అడుగునున్న వాషర్ కూడా చెడిపోయిందని రుజువు చేశాడు.ప్రతీ క్షణానికీ ప్రతీ వస్తువుకీ విలువ నిర్ధారించి పైసలు పెంచుకుంటూ ఇంతకి రెండింతలు వసూలు చేసుకుని వెళ్లటం శంకర్రావు హాబీ! కాదు వృత్తి!!



ఎందుకని??

ఆతని ప్రశ్నకి... ఆతను వేయని ప్రశ్నకి ఒకే ఒక్క జవాబులాంటి మాట... ఆ కాపు గూడెం నాయకుడు శంకర్రావు కల్లు తాగుతూ మేక తల తింటూంటే చెప్పాడు...

"మీకు మేమిచ్చాం... మీరు ఏం చేసారు అని కాదయ్యా... మీకేం చెయ్యాలో మాకు తెలీట్లేదు. మాకీ బోరింగ్ బాగుసేసి... వొందమంది ఇళ్లల్లో ఆడంగులకి నీటి గండం తప్పించారు. మా గూడెంలో.. ప్రతీవాళ్లూ.. మీకు ఏదో ఒకటి వొండి తేవాలని సర్దాపడ్డారు. కానీ మా పెసిరెంట్‌గారు మీకు ఇయ్యన్నీ వొండిచ్చాక... మేమేటి సేసినా తక్కువే అవుద్దనీ..."

శంకర్రావు కళ్లలో నీళ్లు ఆగాయి. బోరింగ్‌లో నీళ్లు జాల్వారాయి.

వాళ్లిచ్చిన ఆతిథ్యం- వాళ్ల ప్రేమ రుచి చూశాక వాళ్లిచ్చిన డబ్బులు ముట్టుకో బుద్ధవలేదు శంకర్రావుకి.

ఆ తర్వాతెప్పుడూ... శంకర్రావు తనకి రావాల్సిన దానికన్నా ఎక్కువ చేసుకోలేదు- తనకి రావాల్సిన దానికన్నా ఎక్కువే పొందాడు- పొందుతూనే వున్నాడు. ఇవ్వాళ శంకర్రావు ఆస్తిపరులకన్నా ఆనందం పొందుతున్నాడు.

*